క్లుప్తంగా

వెంకటేశ్వరుడికి వెండి కిరీటాల బహూకరణ



పొదలకూరు: పట్టణంలోని శ్రీలక్ష్మీ గోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో కొలువైన స్వామి, అమ్మవార్లకు 750 గ్రాముల వెండి కిరీటాలను పట్టణానికి చెందిన బొల్లినేని హరిబాబునాయుడు దంపతులు శనివారం బహూకరించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహక కమిటీ కార్యదర్శి వాకాటి శ్రీనివాసులురెడ్డి మాట్లాడారు. దాతలు ముందుకొచ్చి వీటిని అందజేయడాన్ని అభినందించారు. శ్యామ్‌ప్రసాద్, కొమ్మి వేణుగోపాల్, చొప్పా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

విరువూరుకు కాకాణి రాక నేడు

పొదలకూరు: మండలంలోని విరువూరుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సోమవారం ఉదయం పది గంటలకు రానున్నారని మాజీ సర్పంచ్ బచ్చల సురేష్‌కుమార్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇసుక రీచ్‌ను ఆయన పరిశీలించనున్నారని చెప్పారు.

పేదలకు దుస్తుల పంపిణీ



బుచ్చిరెడ్డిపాళెం : నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా బుచ్చిరెడ్డిపాళెం పాత కాశీపాళెంలోని మహాలక్ష్మమ్మ ఆలయంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం దుస్తులను పంపిణీ చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. దేవస్థానం అధ్యక్షుడు బండారు వేణు, ఆర్యవైశ్య సంఘం జిల్లా కార్యదర్శి సుమంత్, మండల కార్యదర్శి సరాబు అజయ్, దేవస్థానం సభ్యులు రాజా రమేష్, మాదేష్, విష్ణు, సందీప్, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ పీజీఆర్ఎస్ రద్దు

నెల్లూరు(బారకాసు) : భారీ వర్షాలు, తుఫాన్ హెచ్చరికల కారణంగా నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కమిషనర్ సూర్యతేజ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ సమస్యలను విన్నవించేందుకు నేరుగా కార్యాలయానికి రావద్దని, అత్యవసరమైతే ఫోన్ ద్వారా తెలియజేయాలని సూచించారు.

పేదల ముంగిటకే వైద్యం



సైనాపురంలో చికిత్సలు అందిస్తూ..



సంచార వైద్య వాహనం

- ఎస్ఈఐఎల్ ఎనర్జీ సేవలు
- రెండు మండలాల్లో వైద్యం
- సీఎస్సార్ నిధులతో నిర్వహణ

ముత్తుకూరు: మండలంలోని నేలటూరులో గల ఎస్ఈఐఎల్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్ (థర్మల్ ప్రాజెక్ట్) నిర్వాహకులు సంచార వాహనం ద్వారా ప్రాజెక్ట్ ప్రభావిత గ్రామాల్లో విలువైన వైద్యసేవలను అందిస్తున్నారు. ప్రభుత్వ వైద్యసేవలకు దూరంగా ఉన్న గ్రామాల్లో సీఎస్సార్ నిధుల ద్వారా వైద్యసేవలతో పాటు మందులను అందజేస్తూ మన్ననలు అందుకుంటున్నారు. ముత్తుకూరు, తోటపల్లిగూడూరు మండలాల్లోని ప్రాజెక్ట్ ప్రభావిత గ్రామాల్లో మొబైల్ మెడికల్ యూనిట్ ద్వారా వైద్యశిబిరాలను ఏర్పాటు చేసి చికిత్సలు, సేవలను అందిస్తున్నారు.

వైద్యసేవలిలా..

జూన్, 2023లో సంచార వైద్యసేవలను ప్రారంభించారు. దీని ద్వారా ఈ ఏడాది జూన్ నాటికి 262 వైద్యశిబిరాలను నిర్వహించి, 14,436 మందికి వైద్య పరీక్షలు, చికిత్సలను అందించారు. ఆధునిక వైద్య పరికరాలు కలిగిన వాహనంలో మందులతో పాటు అనుభవం కలిగిన ఒక వైద్యుడు, ఫార్మసిస్ట్, శిక్షణ పొందిన డ్రైవర్ గ్రామాల్లో శిబిరాలను ఏర్పాటు చేస్తూ, ఆశ వర్కర్ల సాయంతో పేదలకు వైద్యసేవలను అందిస్తున్నారు. నెలకు 25 రోజుల పాటు పేదలకు అందుబాటులో ఉంటున్నారు.

వివిధ వ్యాధులకు మందులు

విటమిన్ లోపాలతో పాటు చర్మవ్యాధులు, జలుబు, గ్యాస్ట్రిక్ సమస్యలు, పౌష్టికాహార లోపం, రక్తహీనత, విరేచనాలు, తలనొప్పి, కీళ్ల నొప్పులు, కంటి సమస్యలు, శరీర నొప్పులు, జ్వరం తదితర సమస్యలకు చికిత్సను సంచార వైద్య వాహనం ద్వారా అందిస్తున్నారు. ఈ సేవలను పలువురు వినియోగించుకుంటున్నారు.

సేవలు అమూల్యం



ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం పది కిలోమీటర్ల దూరంలో ఉంది. ఎస్ఈఐఎల్ కంపెనీ వారి సంచార వైద్యం మా గ్రామానికే కాకుండా చుట్టుపక్కల గ్రామాలకు ఎంతో ఉపయోగంగా ఉంది. వైద్యసేవలతో పాటు మందులను ఉచితంగా అందిస్తున్నారు.

: గొల్ల అచ్చమ్మ, మల్లికార్జునపురం

ఇంటి వద్దే ఆరోగ్య సంరక్షణ



మొబైల్ మెడికల్ యూనిట్ ద్వారా తీర ప్రాంతంలోని గ్రామాల ముంగిట వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నాం. నిరుపేదల ఆరోగ్య సంరక్షణకు కృషి చేస్తున్నాం. వైద్యసేవలతో పాటు మందులను సద్వినియోగం చేసుకుంటున్నారు.

: డాక్టర్ ప్రవీణ్‌కుమార్, వైస్ ప్రెసిడెంట్, సేవామోట్ ట్రస్ట్

పేదలకు చాలా మేలు



ఎస్ఈఐఎల్ సంస్థ ద్వారా ఏర్పాటు చేసే వైద్యశిబిరాలతో ఎంతో మంది పేదలకు విలువైన సేవలందుతున్నాయి. ఇంటి ముందుకొచ్చే సంచార వైద్యం ద్వారా చికిత్సలతో పాటు నెలకు సరిపడా మందులనూ అందజేస్తున్నారు.

: మునుకూరు జనార్దన్‌రెడ్డి, సర్పంచ్, ఎమ్మీపాళెం

కాకాణికి నేతల అభినందన



అభినందనలు తెలుపుతున్న సాయిమోహన్‌రెడ్డి

మనుబోలు: మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో జిల్లాలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తథ్యమని పార్టీ మండల నేత మన్నెమాల సాయిమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. పిడూరుకు చెందిన సుమారు 50 మందితో కలిసి కాకాణిని నెల్లూరులోని ఆయన నివాసంలో కలిసి అభినందనలను తెలియజేశారు.

- కాకాణిని జట్లకొండూరు నేతలు కలిసి విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. మనుబోలు మండల ఉపాధ్యక్షుడు తిక్కవరపు వెంకటరమణారెడ్డి, జట్లకొండూరు ఉప సర్పంచ్ తులసీరామ్, షాహుల్, చెన్నారెడ్డి శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కాకాణితో జట్లకొండూరు నేతలు

బైక్‌ను ఢీకొట్టిన కారు



ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన పవన్‌కుమార్



ప్రమాదానికి కారణమైన కారు

- ఇద్దరికి తీవ్రగాయాలు
- కేసు నమోదు

కొడవలూరు : మోటార్ బైక్‌ను కారు ఢీకొట్టగా, ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన నార్తురాజుపాళెం వద్ద హైవేపై గురువారం రాత్రి చోటుచేసుకొంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. సంగం మండలం అన్నారెడ్డిపాళేనికి చెందిన గంగపట్నం పవన్‌కుమార్ నార్తురాజుపాళెం హైవే దగ్గరున్న సరోజ్ ఐస్ ఫ్యాక్టరీలో చేపల ప్యాకింగ్ పనికి వెళ్తుంటారు. రోజూలాగే ఈ నెల 10న గురువారం కూడా ఫ్యాక్టరీలో పనికి వెళ్లారు. రాత్రి 8 గంటల ప్రాంతంలో ఆకలిగా ఉండడంతో స్నేహితుడి బైక్ తీసుకొని మరో స్నేహితుడైన బుచ్చికి చెందిన పృథ్వీ శ్రీరామ్‌తో కలిసి నార్తురాజుపాళేనికి వెళ్లారు. అక్కడ టిఫిన్ చేసుకుని తిరిగి 9 గంటల ప్రాంతంలో ఇద్దరూ బైక్‌పై ఫ్యాక్టరీకి వస్తూ ఆంజనేయస్వామి గుడి వద్ద హైవేను క్రాస్ చేస్తుండగా, కావలి వైపు నుంచి అతివేగంగా వచ్చిన కారు వారి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో పవన్‌కుమార్ కుడి కాలు పూర్తిగా నుజ్జవ్వగా, ఆయన స్నేహితుడు పృథ్వీ శ్రీరామ్ తలకు బలమైన గాయమైంది. క్షతగాత్రులకు నెల్లూరులోని మెడికవర్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి పవన్‌కుమార్‌ను మెరుగైన వైద్యం కోసం చెన్నై విజయా హాస్పిటల్‌కు తరలించారు. పృథ్వీ శ్రీరామ్‌ను నెల్లూరులోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. క్షతగాత్రుడైన పవన్‌కుమార్ తండ్రి గంగపట్నం ప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆదివారం పోలీసులు కేసు నమోదు చేశారు.

అప్రమత్తంగా ఉండండి



తీరప్రాంత వాసులకు సూచనలిస్తున్న పోలీస్ సిబ్బంది

తోటపల్లిగూడూరు: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో రానున్న రోజుల్లో తుఫాన్ వచ్చే అవకాశం ఉండటంతో మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై వీరేంద్రబాబు సూచించారు. తీర ప్రాంత గ్రామాలైన వెంకటేశ్వర పట్టపుపాళెం, ముత్యాలతోపు, పట్టపుపాళెం, వెంకన్నపాళెం పట్టపుపాళెం, కోడూరు బీచ్ తదితర ప్రాంతాల్లో స్థానిక పోలీస్ సిబ్బందితో కలిసి ఆదివారం ఆయన పర్యటించారు. స్థానికులకు అవగాహన కల్పించిన అనంతరం ఆయన మాట్లాడారు. తీర ప్రాంత వాసులు సురక్షిత ప్రాంతాలకు తరలిరావాలన్నారు. మత్స్యకారులు వేటకు దూరంగా ఉండాలని కోరారు. తుఫాన్ సమయంలో ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా పోలీస్ శాఖను సంప్రదించాలని సూచించారు.

మాతమ్మ ఆలయం వద్ద పొంగళ్లు



వెంకటాచలం: మండలంలోని తిక్కవరప్పాడులో గల మాతమ్మ ఆలయం వద్ద పొంగళ్లను శనివారం పెట్టారు. అరుంధతీయవాడ నుంచి తప్పెట్లతో యువకులు నృత్యాలు చేస్తూ ఉత్సాహంగా హాజరయ్యారు. ఆలయం వద్దకు మహిళలు చేరుకొని ప్రత్యేక పూజలు చేసి పొంగళ్లు పెట్టారు. భక్తులకు ప్రసాదాలను అందజేశారు.

చెన్నకేశవాలయంలో పూజలు



మనుబోలు: స్థానిక శ్రీదేవీ, భూదేవీ సమేత చెన్నకేశవాలయంలో ఏకాదశి పూజలను శాస్త్రోక్తంగా ఆదివారం నిర్వహించారు. అభిషేకాలు, ప్రత్యేక పూజలను అర్చకుడు హనుమాచార్యులు ఆధ్వర్యంలో జరిపారు. అనంతరం ఆలయం వద్ద ప్రసాద వితరణ చేశారు. ఉభయకర్తలుగా కాట్రపల్లి మునిరామయ్య, మధుసూదనమ్మ దంపతులు వ్యవహరించారు.

మద్యం దుకాణాన్ని దూరంగా మార్చండి



మాట్లాడుతున్న నేతలు

తోటపల్లిగూడూరు: నరుకూరు సెంటర్‌లో జనావాసాల మధ్య ఉన్న మద్యం దుకాణాన్ని ఊరికి దూరంగా తరలించాలని సీపీఎం మండల కార్యదర్శి వేగూరు వెంకయ్య డిమాండ్ చేశారు. నరుకూరు సెంటర్‌లోని పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ నిరంకుశ విధానాలను వ్యతిరేకంగా ఉద్యమాన్ని కొనసాగిస్తామని చెప్పారు. నరుకూరు సెంటర్‌లో ఈ నెల 15న సీపీఎం మండల మహాసభను నిర్వహించనున్నామని పేర్కొన్నారు. మద్యం దుకాణాన్ని మార్చని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని స్పష్టం చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, జిల్లా కార్యవర్గ సభ్యుడు మోహన్‌రావు, మండల సభ్యులు కాల్తిరెడ్డి రమణమ్మ, రాజా, మధు, వెంకటేశ్వర్లు, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో విజయదశమి



పొదలకూరు: విజయలక్ష్మిగా కన్యకాపరమేశ్వరి



పొదలకూరు: భద్రకాళి అమ్మవారి గ్రామోత్సవం



ముత్తుకూరు: కృష్ణపట్నంలో..



మనుబోలు: భద్రకాళిగా అమ్మవారు

పొదలకూరు: విజయదశమిని నియోజకవర్గంలో శనివారం భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. ఆలయాలకు భక్తులు పోటెత్తారు. జగన్మాత విశేషాలంకారాల్లో దర్శనమిచ్చారు.

- పట్టణంలోని కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో అమ్మవారు విజయలక్ష్మిగా దర్శనమిచ్చారు. దర్బార్ అలంకారంలో ఆదివారం దర్శనమిచ్చారు. సహస్రనామార్చన, ఖడ్గమాల తదితర పూజలను నిర్వహించారు. ఆలయ చైర్మన్ ఆదూరు వెంకటసుబ్బయ్య, సెక్రటరీ రాచపూటి రామలింగయ్య తదితరులు పాల్గొన్నారు.
- మండలంలోని మొగళ్లూరులో భద్రకాళీ అమ్మవారికి గ్రామోత్సవాన్ని నిర్వహించారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలను జరిపారు.
- పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్లో గల శ్రీలక్ష్మీ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో స్వామి, అమ్మవార్ల కల్యాణాన్ని వేడుకగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్ఛారణల నడుమ కల్యాణం కనుల పండువగా సాగింది.
- ముత్తుకూరు: మండలంలోని కృష్ణపట్నంలో గల మహాలక్ష్మి, పార్వతీదేవి విగ్రహాలను శోభాయమానంగా అలంకరించారు. పలు ప్రాంతాల్లో గ్రామోత్సవాలను నిర్వహించారు.
- మనుబోలు: మనుబోలులోని పోలేరమ్మ ఆలయం, పందిళ్లలో ఏర్పాటు చేసిన అమ్మవారు భద్రకాళి, ధనలక్ష్మి అలంకారాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. పూజలను అర్చకులు శ్రీనివాసులు, సుబ్రహ్మణ్యంశర్మ, సాయికుమార్‌శర్మ ఆధ్వర్యంలో జరిపారు. ఉభయకర్తలుగా నీలొట్టి విజయ్‌కుమార్, సుమతి, పోలంరెడ్డి రాధాకృష్ణారెడ్డి వ్యవహరించారు.

తోటపల్లిగూడూరు: వరిగొండలో వెలసిన జ్వాలాముఖి ఆలయం, నరుకూరు ఇందిరాకాలనీలో కొలువైన రాజరాజేశ్వరి ఆలయం, పేడూరులోని చాముండేశ్వరి ఆలయాల్లో అమ్మవార్లు విశేషాలంకారాల్లో దర్శనమిచ్చారు. పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు, విశేషాభిషేకాలు, పూలంగిసేవ తదితరాలను జరిపారు.

వైభవంగా అశ్వవాహన సేవ

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : మండలంలోని జొన్నవాడలో కొలువైన మల్లికార్జున సమేత కామాక్షితాయి అమ్మవార్లకు నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అశ్వవాహనసేవ వైభవంగా జరిగింది. ఉదయం స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఏకాంతసేవ జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



మనుబోలు: ధనలక్ష్మి అలంకారం



బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : అశ్వవాహనంపై కామాక్షితాయి



తోటపల్లిగూడూరు: చిన్నచెరుకూరులో వాహన పూజ

ఊరూరా మట్టి మాఫియా



మినగల్లు నుంచి మట్టిలోడుతో వెళ్తున్న ట్రాక్టర్

- రేయింబవళ్లు యథేచ్ఛగా తరలింపు
- ప్రశాంతమ్మ మాటలు నీటిమూటలే

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : మట్టి, ఇసుక, గ్రావెల్‌ను అక్రమంగా తరలించేవారు ఏ పార్టీకి చెందిన వారైనా కఠిన చర్యలు తీసుకునేందుకు వెనుకాడబోమని కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి పదేపదే చెప్పారు. అయితే ఆమె మాటలను తెలుగు తమ్ముళ్లు అస్సలు పట్టించుకోవడం లేదు. బుచ్చిరెడ్డిపాళెం మండలంలో ఏ గ్రామంలో చూసినా రాత్రీపగలు తేడా లేకుండా వందల సంఖ్యలో ట్రాక్టర్లతో మట్టి తరలిస్తూ రూ.లక్షలు దండుకుంటున్నారు. ముఖ్యంగా జొన్నవాడ, పెనుబల్లి, పంచేడు, మినగల్లు గ్రామాల్లో స్థానిక టీడీపీ నాయకుల కనుసన్నల్లో అక్రమ మట్టి రవాణా మూడుపువ్వులు ఆరుకాయలుగా కొనసాగుతోంది. జొన్నవాడలో కరకట్ట రోజురోజుకు కరిగిపోతోంది. పెనుబల్లి, పంచేడు, మినగల్లు గ్రామాల్లో రైతులను మభ్యపెట్టి వారి భూముల నుంచి మట్టిని తరలించేస్తున్నారు. మినగల్లు గ్రామ మధ్యలో నుంచి ట్రాక్టర్లు అతివేగంతో మట్టిలోడుతో వెళ్తుండటం చూసి స్థానికులు భయాందోళనలకు గురవుతున్నారు. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు ఆటోల్లో, నడిచి వెళ్తుంటారు. మట్టి ట్రాక్టర్ల దెబ్బకు రోడ్డు మీదకు వెళ్లాలంటేనే బెంబేలెత్తిపోతున్నారు. ప్రధాన రోడ్డు పక్కన నివాసం ఉండేవారు ఇంట్లో చిన్నారులను బయటకు వదలాలంటే హడలిపోతున్నారు. ఏ ట్రాక్టర్ తమ బిడ్డలను పొట్టన పెట్టుకుంటాయోనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పట్టించుకోని ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

సొంత పార్టీకి చెందిన నాయకులు నిత్యం అక్రమంగా మట్టి తరలిస్తున్నా కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. పలు సందర్భాల్లో మట్టి, ఇసుక తరలించే వారు ఎవరైనా చర్యలు తప్పవని చెప్పారు. మాఫియాకు సహకరించే అధికారులపైనా వేటు తప్పదని హెచ్చరించారు. అయితే ఆ దిశగా ఆమె ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. అనేక సమావేశాల్లో పదేపదే అక్రమార్కులు, అవినీతిపరులను సహించేది లేదని చెప్తారు. కానీ ఆచరణలో మాత్రం ఒక్క అడుగుమాత్రం ముందుకు పడటంలేదు. పైకిమాత్రమే మాటలు చెబుతున్నారని, లోలోపల తమ పార్టీ నాయకులు, కార్యకర్తలను ఇష్టారాజ్యంగా దోచుకుంటున్నా ఎమ్మెల్యే మౌనంగా ఉండటం ఏంటని ప్రజలు అంటున్నారు.